నమస్కారం గురువుగారూ 🙏

నిన్న అభయ ఆశ్రమానికి వచ్చాక మీ మాటలు విన్నాక నాకు చాలా స్ఫూర్తిగా అనిపించింది. మీరు ప్రేరేపించే విధానం చాలా బాగుంది.

నేను ఈ పోలీసు యూనిఫాం కోసం గత 2 నోటిఫికేషన్ల నుండి ప్రయత్నిస్తున్నాను. గతంలో నేను ఎటువంటి శిక్షణ లేకుండా ఇంట్లో ఉండి పిల్లల్ని చూసుకుంటూ ఫైనల్ పరీక్షల్లో కూడా మంచి మెరిట్ తెచ్చుకుని, పత్రాల పరిశీలన కూడా అయిపోయాక నార్మలైజేషన్ ప్రక్రియలో ఒకసారి వయసు తక్కువ ఉందని పోస్టు ఇవ్వలేదు, మరొక సారి 0.25 మార్కుతో పోస్టు పోయింది. ఈసారి నోటిఫికేషన్ లో ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో ఉన్నాను.

ఇంట్లో కూర్చుని చదివితే పోయిన నోటిఫికేషన్ లో ఉద్యోగం పోయినట్లే ఈసారి కూడా ఉద్యోగం పోతుందేమో అని బాధపడుతున్న నాకు అభయ ఫౌండేషన్ వారు, వివిఎంఆర్ లాజిక్స్ వాళ్లు ఇస్తున్న ఉచిత శిక్షణ గురించి విన్నాక, నేను తప్పకుండా ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం కలిగింది. మా లాంటి మహిళల కోసం మీరు ఆలోచించి ఈ కార్యక్రమం పెట్టడం మా అదృష్టం.

నిన్న అభయ ఫౌండేషన్ కి వచ్చి ఇంటికి వెళ్లాక నా కొడుకు "నువ్వు పోలీసువి అవుతావా అమ్మా" అని అడిగాడు సర్. ఆ మాటకి నాకు కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈసారి కచ్చితంగా ఉద్యోగం సాధిస్తానని చెప్పాను కూడా. పెళ్లయ్యాక కూడా నాకు యూనిఫాం మీద ఉన్న ఆశ చావడం లేదు. మీ దగ్గర శిక్షణ పొందితే ఖచ్చితంగా ఉద్యోగం వస్తుందనే నమ్మకం నాకు ఉంది సర్.

నిన్న నేను గమనించిన ఒక విషయం మీతో చెప్పాలనుకుంటున్నాను. కొంతమంది "మేము శుభ్రం చేయాలా? ఉచితం అని మళ్లీ రీఫండ్ ఎందుకు అడుగుతున్నారు?" అంటున్నారు. కానీ మనం మన ఇంటిని శుభ్రంగా ఉంచుకోమా! మన ఇల్లు ఎలా ఉంచుకుంటామో ఆశ్రమాన్ని కూడా అలాగే శుభ్రంగా ఉంచుకోవాలి. ఇక రీఫండ్ విషయానికి వస్తే బయట హాస్టల్ లో ఒక నెల ఉంటేనే 6000 అవుతుంది, మళ్లీ శిక్షణకు వేరే మొత్తం కట్టాలి. కానీ ఇక్కడ ఒక 5000 అడుగుతున్నారు, అది కూడా మళ్లీ శిక్షణ అయిపోయాక మనకే ఇస్తారు. బయట ఒక్కరికీ 50 నుండి 60 వేలు అయ్యే ఖర్చుని ఇక్కడ మనకు ఉచితంగా ఇస్తున్నారు. ఇటువంటి ప్రశ్నలు మనం అడగడం కూడా సరికాదు.

ఈ శిక్షణకు ఎంపిక అయితే మాకు దేవుడు మీ రూపంలో వచ్చి ఉద్యోగం తెచ్చుకోవడానికి దారి చూపించాడని అనుకుంటాం సర్ 🙏